రక్షణ కల్పించాలి



మహిళా డాక్టర్‌పై కోల్‌కతాలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలను అమలు చేయాలి. రాత్రి వేళల్లో వైద్యశాలలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్‌లకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల పీహెచ్‌సీలకు రాత్రివేళ పోలీసు సెక్యూరిటీ కల్పించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ జయరాం, పీహెచ్‌సీ సెంటర్, పోరుమామిళ్ల

భద్రత ముఖ్యం



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన లాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా దేశ వ్యాప్తంగా భద్రతా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘాతుకాలకు పాల్పడిన వ్యక్తులపై అత్యంత వేగంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత, భరోసా కల్పించాలి. – డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, వైద్యనిపుణుడు, పోరుమామిళ్ల



కఠిన శిక్షలు అమలు చేయాలి



ప్రజల ఆరోగ్యం కోసం పరితపించే వైద్యులు, సిబ్బందిపై దాడితో సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి దాడులతో వైద్యులు రాత్రి, పగలు సేవలు అందించేందుకు వెనుకడుగు వేస్తారు. ఫలితంగా నిజమైన రోగులకు కూడా వైద్య సేవలు దూరమవుతాయి. ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలి. డాక్టర్లపై ఎలాంటి దాడులు జరిగినా కఠిన శిక్షలు అమలు చేయాలి.

–డాక్టర్ శైలజ, వైద్యాధికారి, కలసపాడు మండలం

ప్రత్యేక చట్టాలు తేవాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటన బాధాకరం. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. డాక్టర్లు, సిబ్బంది రక్షణకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలి. ఆసుపత్రిలో విధులను నిర్వహించే సమయంలో రక్షణ కల్పించాలి.

– దుర్గ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, కలసపాడు మండలం

మురుగు కదలదు.. కంపు వదలదు..!

- ప్రొద్దుటూరు,బద్వేలు మున్సిపాలిటీలో సమస్యలు తిష్ట
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న పట్టణవాసులు



ప్రొద్దుటూరు : పదో వార్డులో మురికి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రొద్దుటూరు : పురవాసులను మురుగు సమస్య వెంటాడుతోంది. ఎక్కడికక్కడ కాలువలు పూడుకుపోవడంతో మురుగు తిష్ట వేస్తోంది. ఫలితంగా దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమైంది. మున్సిపాలిటీ పరిధిలో మదూరు ప్రధాన కాలువతో పాటు కొత్తపల్లె -1, 2, ప్రొద్దుటూరు -1, 2 మురికి కాలువలు ఉన్నాయి. పట్టణంలో కిలో మీటర్ల మేర కాలువలు విస్తరించి ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో కాలువల్లో ప్లాస్టిక్, మట్టి ఇతర పదార్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. ఈ ప్రభావం కారణంగా మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. ఎక్కడికక్కడే నిల్వ ఉండటంతో కాలువల పరిధిలో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు జేసీబీ ద్వారా ఎప్పటికప్పుడు పూడికలను తొలగిస్తే తప్ప ఫలితం ఉండదు. మెయిన్ రోడ్డులోని ప్రధాన కాలువలు మొదలుకొని, వార్డుల్లో ఉన్న అంతర్గత కాలువల వరకూ చుక్కనీరు ముందుకు పారే పరిస్థితి లేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలువల్లో నీరు రోడ్డుపైకి చేరుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విజృంభిస్తున్న జ్వరాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో పారిశుద్ధ్యం లోపించడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు, డయేరియా, కామెర్లుతో బాధితులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అనారోగ్య పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డుల్లో 72 వేలు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా 200 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం మున్సిపాలిటీలో 9 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు, 73 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, 22 మంది దినసరి వేతనం కింద పనిచేసే కార్మికులు మాత్రమే ఉన్నారు. దాదాపు 96 మంది కార్మికుల కొరత ఉంది. అలాగే మున్సిపాలిటీలో చెత్త తరలించే వాహనాలు కేవలం 6 మాత్రమే ఉన్నాయి. దీంతో చాలా వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా దోమలు విజృంభించి ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. దోమల నియంత్రణ చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సీజనల్ వ్యాధులు, జ్వరాలు విజృంభిస్తున్నాయి.

లోపించిన పారిశుద్ధ్యం

చాపాడు: మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్యం లోపించింది. ఇటీవల కాలంలో చాపాడు మండలంలోని అల్లాడుపల్లె, మండల కేంద్రమైన ఖాజీపేటతో పాటు పలు గ్రామాలలో అరిశుభ్రత కారణంగా డయేరియా ప్రబలి పలువురు డయేరియా బారిన పడ్డారు. ఖాజీపటలో జెడ్పీ హైస్కూల్‌లో కలుషిత మంచినీటి వలన 10 మందికి పైగా విద్యార్థులు, అల్లాడుపల్లెలో 15 మంది చిన్న పిల్లలతో పాటు పలువురు పెద్దలు డయేరియాతో ఆసుపత్రుల పాలయ్యారు. కలుషిత మంచినీరు, దోమల వ్యాప్తి వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టకపోవటం వల్లనే జ్వరాల బారిన పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోకుల్ నగర్‌లో కాలువలు నిర్మించాలి



7వ వార్డు పరిధిలోని గోకుల్ నగర్‌లో మురికి కాలువలు నిర్మించాలి. కాలువలు లేని కారణంగా వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఇళ్ల ముందే వీధుల వెంబడి నీరు నిలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కాలువల నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి.

– బి.నారాయణరెడ్డి, గోకుల్ నగర్, ప్రొద్దుటూరు



బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



చాపాడు మండలం నెర్రవాడలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



13వ వార్డులో అధ్వానంగా ఉన్న మురికి కాలువ

ఎవరి పనుల్లో వారు బిజీబిజీ

కుందూనది పరిధిలోని పలు గ్రామాల్లోని కొంతమంది రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు. నాట్లు పనులతో పొలాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. ఆలస్యమైతే కూలీల కొరత ఎదుర్కొనాల్సి వస్తుందని భావించిన పలువురు రైతులు వరి నాట్లు పనులను ముమ్మరం చేశారు. రైతులు మడులకు నీళ్లు అందిస్తూ, ట్రాక్టరుతో దమ్ము చేస్తూ, కూలీలతో గెన్యాలు వేసుకుంటూ, ఎద్దులతో మాను కొడుతూ, ఎరువులు చల్లుకుంటూ, కూలీలు నారు తెంపుతూ, నారును మడిలో వేస్తూ, వరినాట్లు వేసుకుంటూ బిజీబిజీగా ఉన్నారు. – రాజుపాళెం



ఎద్దులతో మానుకొడుతున్న రైతులు



వరినాట్లు వేస్తున్న కూలీలు



వరినారును తెంపుతున్న కూలీలు

క్లుప్తంగా

అమృతానగర్‌లో నాకాబంది



అమృతానగర్ వాసులతో మాట్లాడుతున్న సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో రూరల్ పోలీసులు ఆదివారం ఉదయం నాకాబంది నిర్వహించారు. అనుమానిత ఇళ్లతో పాటు ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 45 మోటార్ బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ అమృతానగర్‌లో అనుమానిత వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిషేధిత గంజాయి, మద్యం విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. వీటిని ఎవరైనా విక్రయిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు యుగంధర్, దేవకిరణ్ కుమార్, గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న హిందూఐక్య వేదిక

పోరుమామిళ్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలను ఖండిస్తూ ఆదివారం పోరుమామిళ్లలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, బాలరంగయ్య మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండ ఆగాలని కోరారు. ర్యాలీలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జన చైతన్య సంఘం మాజీ డైరెక్టర్ మృతి

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంకు చెందిన జన చైతన్య సమగ్రాభివృద్ధి సంఘం మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జన చైతన్య మ్యాక్స్ గౌరవ అధ్యక్షుడు తిప్పన నాగేశ్వరనాయుడు ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. నాగేశ్వరనాయుడు మృతదేహానికి సోమవారం బ్రహ్మంగారిమఠంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రతిభ



ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లెరంగయ్యగారి వెంగలరెడ్డి, విజయమ్మ కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ఆలిండియా 1,443వ ర్యాంకు సాధించాడు. ఆగస్టు 11న జరిగిన నీట్ పీజీ పరీక్షల్లో సత్తా చాటాడు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మరెన్నో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కుటుంబసభ్యులు,గ్రామస్తులు ఆకాంక్షించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



చెన్నవరంలో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభిరామస్వామి ఆలయం

గోపవరం : మండలంలోని చెన్నవరంలో శ్రీపట్టాభిరామస్వామి ఆలయం ధ్వజప్రతిష్ట మహోత్సవం 26 నుంచి 28వ తేదీ వరకు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 26వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల నుంచి పూజా కార్యక్రమం , మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, 27వ తేదీ మంగళవారం గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ కోలాటం, 28వ తేదీ బుధవారం ఉదయం 9–15 గంటల నుండి విగ్రహ ప్రతిష్ట, 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముకుందా.. ముకుందా..



ప్రొద్దుటూరు కల్చరల్: ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున వేణుగోపాల స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, గోపూజ, ప్రధాన కలశ స్థాపన తదితర పూజాకార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. కాగా సోమవారం వేణుగోపాల స్వామివారికి 108 కలశాల పూజాద్రవ్యాలతో అభిషేకం, గణపతి, అభయ ఆంజనేయస్వామి, శ్రీకృష్ణ బీజాక్షర మూలమంత్రహోమాలు, సాయంత్రం 5 గంటలకు కోలాటం, రాత్రి 8 గంటలకు హరికథ, రాత్రి 12 గంటలకు చిన్నికృష్ణునికి ఊంజల్ సేవ చేయనున్నారు. కార్యక్రమంలో భక్తుల పాల్గొనాలని యాదవ సేవాసంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ కోరారు.

అట్టహాసంగా కృష్ణాష్టమి

పోరుమామిళ్ల: వైష్ణవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. భగవద్గీత శ్లోకాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



పోరుమామిళ్ల: వైష్ణవి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

లక్ష్యానికి మించి పార్టీ సభ్యత్వ నమోదు చేయాలి

ప్రొద్దుటూరు : సభ్యత్వ నమోదులో కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి సభ్యత్వాలు పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో 2 లక్షల సభ్యత్వ నమోదే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. స్థానిక దొరసానిపల్లెలోని గోపికృష్ణ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు తమ పార్టీ సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమం చేపడుతుందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి దేశ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని, తొలుత ప్రధాని నరేంద్ర మోదీ సభ్యత్వం తీసుకుంటారని పేర్కొన్నారు. రెండో తేదీ నుంచి రాష్ట్రాల్లో, జిల్లాల్లో సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా బీజేపీకి 18 కోట్ల సభ్యత్వాలు ఉన్నాయన్నారు. కాగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జోనల్ ఇన్‌చార్జి శివనారాయణ, బొజ్జా రోషన్న, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి జయలక్ష్మి, పట్టణాధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి

జిల్లా అభివృద్ధిపై ఊసే లేదు

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు వంద రోజులు అవుతున్నా జిల్లా అభివృద్ధిపై వారికి ధ్యాస ఉన్నట్లు కనిపించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగనపల్లి చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం విలేకరులతోచంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా అభివృద్ధికి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఉక్కు కర్మాగారం ఊసే లేదని, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదని, కొప్పర్తి పారిశ్రామిక వాడకు నిధులు ఇవ్వలేదని అన్నారు. అలాగే కడప, బెంగళూరు రైల్వే మార్గానికి నిధులు విడుదల చేయలేదని అన్నారు. రైల్వే జోన్ గురించి ప్రస్తావించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.15 వేలు కోట్లు మంజూరు చేసిందని, దీనిని వడ్డీతో సహా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు.పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదని కోరారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్, సత్యనారాయణ, ముంతాజ్, డేవిడ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య కోరారు. మండలంలోని పెన్నానగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వై.హరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ వాహనదారుల చట్టాల కింద ఆటో డ్రైవర్లపై అధిక మొత్తంలో చలనాలను వేసి వసూలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆటో, లారీ డ్రైవర్లపై ఎఫ్‌సీ, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి వాటిని సవరణలు చేస్తూ అధిక మొత్తంలో ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని సాయి ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మాస్క్ కమిటీ సెక్రటరీ గౌస్‌బాషా (బాబ్జీ) కుమార్తె వివాహ మహోత్సవానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుందర్‌రామిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమాల్లో ఆరితేరిన కౌన్సిలర్ కుటుంబం

ప్రొద్దుటూరు : మూడో వార్డు టీడీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి భర్త రామాంజనేయరెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బాషా ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్ కుటుంబం వార్డు పరిధిలోని 7వ రేషన్ షాప్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. కౌన్సిలర్ భర్త రామాంజనేయరెడ్డి గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారని పేర్కొన్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. రామాంజనేయరెడ్డి దంపతులిద్దరూ కౌన్సిలర్లుగా పోటీ చేశారని పేర్కొన్నారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఇద్దరు కుమార్తెలే ఉన్నారని పొందుపరిచారని గుర్తుచేశారు. రేషన్ షాప్‌కు సంబంధించి 350 రేషన్ కార్డులు ఉండగా అదనంగా 370 పెంచుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలను బ్యాంకుల ద్వారా తన పలుకుబడితో మంజూరు చేయించి కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు.

నేడు కవితా పురస్కారాల ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు పల్లా జాతీయ కవితా పురస్కారాలను అందించనున్నట్లు యువ సాహితీ అధ్యక్షుడు పల్లా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.